ప్రైవేట్‌కు బ్యాటరీ స్టోరేజీ ప్లాంట్

సొంతంగా ఏర్పాటు చేసేందుకు ముందుకురాని జెన్‌కో

కేంద్ర సాయంతోపాటు 70 ఎకరాల జెన్‌కో స్థలాన్ని అస్మదీయులకు అప్పగించేందుకు సర్కారు కుట్ర

హైదరాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో ఏర్పాటు చేయాల్సిన అతిపెద్ద బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌పై జెన్‌కో చేతులెత్తేసింది. (బిల్డ్-ఆపరేట్-ఓన్) పద్ధతిలో ఆ ప్లాంట్‌ను సొంతంగా ఏర్పాటు చేయాల్సిన జెన్‌కో పూర్తిగా అస్త్రసన్యాసం చేసింది. ఆ ప్లాంట్‌ను బడాబాబులకు అప్పగించేందుకు టెండర్లను ఆహ్వానించింది. గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ ప్లాంట్ ఏర్పాటుకయ్యే రూ.600 కోట్ల అంచనా వ్యయంలో 40% మొత్తాన్ని (రూ.240 కోట్లు) వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద అందజేస్తుంది. మిగిలిన 60% మొత్తాన్ని (రూ.360 కోట్లు) జెన్‌కో పెట్టుబడిగా పెడితే సరిపోతుంది. అయినప్పటికీ కేంద్ర సాయాన్ని అందిపుచ్చుకోకుండా ఆ ప్లాంట్‌ను ప్రైవేట్‌కు కట్టబెట్టేందుకు జెన్‌కో రంగం సిద్ధం చేసింది. దీంతో కేంద్రం అందించే రూ.240 కోట్లు ప్రైవేట్ వ్యక్తులకు దక్కనున్నాయి.



విద్యుత్తు జెన్‌కోదే.. అమ్మేదీ జెన్‌కోకే

విచిత్రమేమిటంటే ఈ ప్లాంట్‌లో నిల్వచేసే విద్యుత్తు జెన్‌కోదే. డిమాండ్ లేనప్పుడు జెన్‌కో నుంచి తక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలుచేసి ఈ ప్లాంట్‌లోని బ్యాటరీల్లో నిల్వచేస్తారు. డిమాండ్ పెరిగినప్పుడు ఆ విద్యుత్తును మళ్లీ జెన్‌కోకే విక్రయిస్తారు. ఈ ప్లాంట్ జీవిత కాలాన్ని 25 ఏండ్లుగా నిర్ణయించారు. అంటే.. ఈ ప్లాంట్‌ను ఏర్పాటుచేసే ప్రైవేట్ సంస్థ 25 ఏండ్లపాటు జెన్‌కో నుంచి విద్యుత్తు కొనుగోలు చేసి, బ్యాటరీల్లో నిల్వ చేస్తుంది. ఆ విద్యుత్తునే మళ్లీ జెన్‌కోకు విక్రయించి సొమ్ము చేసుకుంటుంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన జెన్‌కో వార్షిక టర్నోవర్ రూ.15 వేలకోట్ల పైమాటే. అలాంటి సంస్థ బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కేవలం రూ.360 కోట్లు పెట్టుబడిగా పెట్టలేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై జెన్‌కోతో పాటు ప్రభుత్వం పునరాలోచించాలని విద్యుత్తు రంగ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

అస్మదీయుల కోసమేనా?

బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటును ప్రైవేట్ సంస్థకు అప్పగించేందుకు టెండర్లు పిలవడం వెనుక భారీ కుంభకోణం ఉన్నదని, వీజీఎఫ్‌గా సమకూరే రూ.240 కోట్లతో పాటు జెన్‌కోకు చెందిన 70 ఎకరాల స్థలాన్ని అస్మదీయులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలు కుట్ర చేశారని, అందుకే ఉద్దేశపూర్వకంగా జెన్‌ను తప్పించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. శంకర్‌పల్లిలో గ్యాస్ ఆధారిత విద్యుత్తు ప్లాంట్ ఏర్పాటు కోసం గతంలో స్థల సేకరణ జరిపారు. కానీ, ఆ ప్లాంట్ ఏర్పాటులో ముందడుగు పడలేదు. జెన్‌కో నిర్లక్ష్యం వల్ల ఆ స్థలంలో ఇప్పటికే కొంత భాగం కబ్జాకు గురైంది. మిగిలిన స్థలంలో బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అదికూడా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. దీన్ని జెన్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బ్యాటరీ స్టోరేజీ పవర్ ప్లాంట్‌ను సొంతంగా జెన్‌కో నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఐదింతలైన ఎయిర్‌టెల్ లాభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.16,134.6 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,876.4 కోట్ల లాభంతో పోలిస్తే ఐదు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.45, 129.30 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది.

ఎన్‌ఎండీసీ ఆకర్షణీయం

హైదరాబాద్, ఫిబ్రవరి 6: ఎన్‌ఎండీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలానికిగాను సంస్థ రూ.1,897 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.1,492.73 కోట్ల లాభంతో పోలిస్తే 29 శాతం ఎగబాకింది. కంపెనీ ఆదాయం 21 శాతం ఎగబాకి రూ.6,942.92 కోట్లకు చేరుకున్నది.

ఎస్బీఐ లాభం 16,891 కోట్లు

క్యూ3లో 84 శాతం పెరిగిన ప్రాఫిట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6:దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అదరగొట్టింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.16,891 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.9,164 కోట్ల లాభంతో పోలిస్తే 84 శాతం వృద్ధిని సాధించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.1,28,467 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది సమకూరిన రూ.1,18,193 కోట్లతో పోలిస్తే ఇది 8.69 శాతం అధికం. దీంట్లో వడ్డీల రూపంలో రూ.1,17,427 కోట్లు సమకూరినట్లు బ్యాంక్ బీఎస్ఈకి సమాచారం అందించింది.

- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.42 శాతం నుంచి 2.07 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ విలువ 0.64 శాతం నుంచి 0.53 శాతానికి దిగొచ్చింది.
- ఎస్బీఐ గ్రూపు కన్సాలిడేటెడ్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 70 శాతం ఎగబాకి రూ.18,853 కోట్లకు చేరుకున్నది. క్రితం ఏడాది ఇది రూ.11,064 కోట్లుగా ఉన్నది. అలాగే ఆదాయం రూ.1,53,072 కోట్ల నుంచి రూ.1,67,854 కోట్లకు ఎగబాకింది.
- బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 4 శాతం అధికమై 41,446 కోట్లుగా నమోదైంది.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.911 కోట్ల నిధులను వెచ్చించింది.

నష్టాల్లో మార్కెట్లు

ముంబై, ఫిబ్రవరి 6: దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలపరంపర కొనసాగుతున్నది. రిజర్వుబ్యాంక్ పరపతి సమీక్షకంటే ముందు మదుపరులు అప్రమత్తతకు మొగ్గుచూపడం తోపాటు ఎఫ్ఐఐలు భారీగా నిధులను తరలించుకుపోవడంతో వరుసగా రెండోరోజూ సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 213.12 పాయింట్లు కోల్పోయి 78,058.16 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 92.95 పాయింట్లు కోల్పోయి 23,603.35 వద్ద ముగిసింది. భారతీ ఎయిర్‌టెల్ షేరు 2.47 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు టైటాన్, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, ఐటీసీ, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్‌లు అత్యధికంగా నష్టపోయాయి.

అరబిందో లాభంలో క్షీణత

హైదరాబాద్, ఫిబ్రవరి 6: అరబిందో ఫార్మా నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.846 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని మాత్రమే గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.940 కోట్లతో పోలిస్తే 10 శాతం తగ్గినట్లు పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.7,352 కోట్లుగా ఉన్న కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.7,979 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది.

కొత్త బాస్.. కోతకు సై!

నేడే ఆర్బీఐ ద్రవ్యసమీక్ష నిర్ణయం
నూతన గవర్నర్ వడ్డీరేట్లను తగ్గిస్తారన్న అంచనాలు
రెపో రేటు పావు శాతం దిగివచ్చే అవకాశం



ముంబై, ఫిబ్రవరి 6: ఆర్బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో జరుగుతున్న తొలి ద్రవ్యసమీక్షలో కీలక వడ్డీ రేట్లు తగ్గుతాయనే అంచనాలే ఎక్కువగా వస్తున్నాయి. శుక్రవారం ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఆర్బీఐ ప్రకటించనున్నది. అయితే ఇటీవలి బడ్జెట్ నేపథ్యంలో ఈ ద్రవ్యసమీక్షపై అటు వ్యాపార-పారిశ్రామిక రంగాలు, ఇటు బ్యాంకర్లు-రుణగ్రహీతలు భారీగానే ఆశలు పెట్టుకున్నారు. దీనికి తగ్గట్టుగానే రెపో రేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) కోత పెట్టవచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయిప్పుడు. నిజానికి గత ద్రవ్యసమీక్షలో అప్పటి గవర్నర్ శక్తికాంత దాస్.. ముున్ముందు పాలసీ రివ్యూల్లో వడ్డీరేట్లు తగ్గవచ్చన్న సంకేతాలనిచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఈ సమీక్ష మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది.

ఐదేండ్ల తర్వాత..

గత రెండేండ్లుగా వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ ద్రవ్యసమీక్షలు ముగుస్తున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా రెపో రేటును 6.50 శాతానికి పెంచారు. అప్పట్నుంచి ఇది అక్కడే ఉంటున్నది. ఇక రెపో రేటును ఆఖరిసారిగా తగ్గించింది 2020 మే నెలలోనే. కరోనా దెబ్బకు దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థలో నూతనోత్సాహాన్ని నింపేందుకు నాటి గవర్నర్ దాస్ ప్రత్యేకంగా ఆర్బీఐ సమీక్ష నిర్వహించి రెపో రేటును తగ్గించారు. రుణ లభ్యత పెరిగేలా 4 శాతానికి దించారు. కానీ ద్రవ్యోల్బణం విజృంభించడంతో తదుపరి ద్రవ్యసమీక్షల్లో దాన్ని అదుపు చేసేందుకు మళ్లీ వడ్డీరేట్లను వరుసగా పెంచుతూపోయారు. ఈ క్రమంలో ఈసారి ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్లు తగ్గితే ఐదేండ్ల తర్వాత ఇప్పుడే తగ్గినట్టు కానున్నది.

ఆటో, రియల్టీకి ఉత్సాహం?

గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై చాలాకాలం నుంచి అధిక వడ్డీరేట్లనే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు అనుసరిస్తున్నాయి. ఫలితంగా ఆయా రుణగ్రహీతలు, వివిధ వ్యాపార రంగాలు ప్రభావితమవుతున్నాయి. కానీ ఈసారి ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గిస్తే రియల్టీ, ఆటోతోపాటు పలు రంగాల్లో తిరిగి అమ్మకాలు పుంజుకుంటాయంటున్నారు. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. సుంకాలను పెంచుతూ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తున్న నేపథ్యంలో వడ్డీరేట్ల తగ్గింపు తొందరపాటే అవుతుందంటున్నవారూ లేకపోలేదు. ముఖ్యంగా వడ్డీరేట్లు తగ్గితే రూపాయిపై మరింత ఒత్తిడి పెరుగుతుందని వారు విశ్లేషిస్తున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠాల్లో కదలాడుతున్న సంగతి విదితమే. కానీ దేశంలో వినిమయ శక్తిని పెంపొందించడానికి బడ్జెట్‌లో తన వంతుగా కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత ఆదాయ పన్ను ఊరటను కల్పించింది. ఈ క్రమంలో ఆర్బీఐ వంతుగా వడ్డీరేట్లను తగ్గించవచ్చన్న అంచనాలే ఎక్కువగా ఉన్నాయి.

జొమాటో ఇకపై ఎటర్నల్

పేరు మార్పునకు లైన్‌క్లియర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఆన్‌లైన్ ఫుడ్, గ్రాసరీ డెలివరీ దిగ్గజం జొమాటో.. పేరు మార్చుకుంటున్నది. ఎటర్నల్‌గా మారిపోతున్నది. ఇందుకు గురువారం జొమాటో సంస్థ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే కంపెనీ వాటాదారులు, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సంబంధిత అధికార వర్గాలు ఆమోదించాల్సి ఉన్నది. ఈ మేరకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో జొమాటో పేర్కొన్నది. కాగా, ఫుడ్ డెలివరీ బిజినెస్ బ్రాండ్ జొమాటో యాప్ పేరు మాత్రం అదే. 'పేరు మార్పునకు మా బోర్డు అంగీకరించింది. షేర్‌హోల్డర్స్ కూడా మద్దతివ్వాలని కోరుతున్నాను. కావాల్సిన అనుమతులన్నీ వచ్చాక మా కార్పొరేట్ వెబ్‌సైట్ పేరు జొమాటో.కామ్ నుంచి ఎటర్నల్.కామ్‌గా మారిపోతుంది. మా స్టాక్ టిక్కర్‌నూ మారుస్తాం' అని జొమాటో వ్యవస్థాపక సీఈవో దీపిందర్ తెలిపారు. ఎటర్నల్‌లో జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, హైపర్‌ప్యూర్ అనే 4 వ్యాపార విభాగాలుండనున్నాయి.

టీసీఎస్ ఉద్యోగులకు షాక్

సీనియర్ ఉద్యోగుల వేరియబుల్ చెల్లింపుల్లో కోత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ సీనియర్ ఉద్యోగులకు షాకిచ్చింది. డిసెంబర్ త్రైమాసికంలో సీనియర్ ఉద్యోగుల వేరియబుల్ చెల్లింపుల్లో 20 శాతం నుంచి 40 శాతం వరకు కోత విధించింది. ఉద్యోగి పనితీరు ఆధారంగా ఈ వేరియబుల్ చెల్లింపులు జరుపుతుంటుంది సంస్థ. వరుసగా రెండు త్రైమాసికాలుగా సిబ్బంది మెరుగైన పనితీరు కనబరిచినప్పటికీ వేరియబుల్ చెల్లింపుల్లో కోత విధించడం విశేషం. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి 100 శాతం వేరియబుల్ చెల్లింపులు జరిపినట్లు కంపెనీ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. కానీ, కొత్త పెట్టిన వారిలో సీనియర్ ఉద్యోగులు ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. ఉద్యోగులకు కార్యాలయాలకు రప్పించడంలో భాగంగా టీసీఎస్ వేరియబుల్ పే నిబంధనల్లో గతేడాది మార్పులు చేసిన విషయం తెలిసిందే. వేరియబుల్ పేను ఆఫీస్ హాజరు తో ముడిపెట్టింది. ఎవరైతే 60 శాతం కంటే తక్కువ ఆఫీస్‌కు హాజరవుతారో వారికి ఎలాంటి చెల్లింపులు ఉండవని స్పష్టంచేసింది. 60-75 శాతం ఉన్నవారికి 50 శాతం, 75-85 శాతం ఉన్నవారికి 75 శాతం, 85 శాతం కంటే ఎక్కువ హాజరుంటేనే వేరియబుల్ అందుకునేందుకు అర్హులుగా పేర్కొంది.

రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న భూ నిర్వాసితులు

జీఎంకు భూ నిర్వాసితుల వినతి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 6: కేటీకే ఓసీ-2 పరిధి ఆకుదారివాడ, పకీరుగడ్డ గ్రామాలను వెంటనే తరలించి ప్యాకేజీతో పాటు నష్టపరిహారం కల్పించాలని కోరుతూ గురువారం జీఎం రాజేశ్వర్‌రెడ్డికి భూ నిర్వాసితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని చాలా సార్లు వినతిపత్రం ఇచ్చామని, చైర్మన్‌ను కూడా కలిశామని చెప్పారు. ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేని తెలిపారు. కేటీకే ఓసీ-2 నుంచి దుమ్ము, దూళి, బ్లాస్టింగ్ వల్ల వెలువడే విష వాయువులతో ఉండలేని పరిస్థితి ఉందన్నారు. వెంటనే తమకు న్యాయం చేయాలని, లేకపోతే ఈ నెల చివరి వారంలో ఓసీ-2 వద్ద వంటా వార్పు, అన్ని పార్టీల మద్దతుతో ఓసీ-2ను ఆపుతామని హెచ్చరించారు. భూ నిర్వాసితుల యూత్ అధ్యక్షుడు బుర్ర మనోజ్‌గౌడ్, రాజయ్య, సిద్ధం శంకర్, సాయి కిశోర్, ఆముదాల రమేశ్, బుర్ర తిరుపతి పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినంధించిన జీఎం

ఫిబ్రవరి 3 నుండి 5వ తేదీ వరకు జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ క్యారమ్ టోర్నమెంట్‌లో భూపాలపల్లి ఏరియాలోని సృజన్‌రావు సింగిల్స్‌లో పాల్గొని విజేతగా నిలిచారు, డబుల్స్‌లో శ్రీనివాస్ పాల్గొని రన్నరప్‌గా నిలిచారు. ఈ సందర్భంగా గురువారం జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి సృజన్‌రావు, శ్రీనివాస్‌ను అభినంధించారు.

పంట మార్పితో శిలీంద్రాలను అరికట్టవచ్చు

ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త నాగరాజు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 6 : రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి చేస్తేనే మట్టి ద్వారా వ్యాపించే శిలీంద్రాలను అరికట్టవచ్చని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త నాగరాజు అన్నారు. గురువారం జంగేడు గ్రామ రెవెన్యూ శివారులోని మిరప తోటల్లో శాస్త్రవేత్తలు క్షేత్ర పర్యటన చేశారు.మిరపలో సమగ్ర సస్యరక్షణ మేలైన యాజమాన్యం పద్ధతులపై అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఉద్యాన అధికారి సునీల్, శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు గంపల సంజీవ్, వేషాల సాంబయ్య, గుడిపాటి సుధాకర్‌రెడ్డి, బానోత్ సమ్మయ్య పాల్గొన్నారు.

రామాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

గణపురం, ఫిబ్రవరి 6 : మండలకేంద్రంలోని పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్‌గౌడ్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అర్చకుడు ముసునూరి నరేశ్ కమిటీ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవర్ధన్‌గౌడ్ మాట్లాడుతూ భద్రత, భక్తు ల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో రూ.20వేలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

టేకుమట్ల, ఫిబ్రవరి 6 : మండలంలోని పంగిడిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి పురాణం సంతోష్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేశ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్న భిక్షపతి డిమాండ్ చేశారు. గురువారం వారు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. మొగుళ్లపల్లి ఎస్సీ హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థి మూడు రోజులుగా పాఠశాలకు పోకుండా కూలీ పనులకు పోతుంటే హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. కలెక్టర్ స్పందించి వార్డెన్‌ను సస్పెండ్ చేసి మృతుడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

మేడారం మినీ జాతరకు ఏర్పాట్లు పూర్తి

- అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలి
- ములుగు కలెక్టర్ దివాకర



క్యూలైన్లలో నీటి సరఫరాను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

తాడ్వాయి, ఫిబ్రవరి 6 : మేడారం మినీ జాతరను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్ల కలెక్టర దివాకర తెలిపారు. గురువారం ఆయన మేడారంలో పర్యటించి మినీ జాతరకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. మొదటగా టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. నిల్వ ఉంచిన మందుల వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎంతమంది భక్తులకు వైద్య సేవలు అందించారని, ఎలాంటి రుగ్మతలతో వైద్య శిబిరానికి వస్తున్నారని వైద్యాధికారిని అడిగితెలుసుకున్నారు. అనంతరం జంపన్నవాగు వద్ద బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌తో పాటు మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన డ్రెస్సింగ్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మినీ జాతరకు సుమారు 10 నుంచి 20 లక్షల మంది భక్తులు తరలివస్తారనే అంచనాలతో ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. నిరంతర విద్యుత్‌తో పాటు 24గంటల పాటు వైద్య సేవలు అందిచేలా చర్యలు తీసుకున్నామన్నారు. అత్యవసర వైద్య చికిత్సలు అవసరమైన వారిని ములుగుకు ఆస్పత్రికి తరలించేందుకు వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. గద్దెల వద్ద తొక్కిసలాట, దొంగతనాలు జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతర పరిసరాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలని డీపీవో దేవరాజ్‌ను ఆదేశించారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో క్యూలైన్లపై చలువ పందిళ్లు, మ్యాట్లు ఏర్పాటు చేయాలని మేడారం జాతర కార్యనిర్వహక అధికారి రాజేంద్రంను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఎస్పీ రవీందర్, డీపీవో దేవరాజ్, డీఎంహెచ్‌వో గోపాల్ రావు, వివిద శాఖల ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

గద్దెలపై హుండీల ఏర్పాటు

సమ్మక్క,సారలమ్మల గద్దెలపై గురువారం దేవాదాయ శాఖ అధికారులు హుండీలను ఏర్పాటు చేశారు. జాతర ఈవో రాజేంద్రం, ఇన్‌స్పెక్టర్, అమ్మవార్ల పూజారులు, పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో హుండీలకు సీల్‌లు వేసి సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలపై ఏర్పాటు చేశారు. భక్తుల రాకను బట్టి అదనపు హుండీలను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.



వనం నుంచి సమ్మక్కను తీసుకొస్తున్న పూజారులు, భక్తులు

ఫూట్ ఫారమ్‌లో సమ్మక్క-సారలమ్మ జాతర

గోవిందరావుపేట, ఫిబ్రవరి6 : మండలంలోని చల్వాయి గ్రామ పంచాయతీ పరిధి ఫూట్ ఫారమ్‌లో గురువారం సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభమైంది. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే జాతరలో భాగంగా మేడారంలో మినీ జాతర జరిగే సంవత్సరం ఫూట్ ఫారమ్‌లో జాతరను పూజారి ఈసం సమ్మయ్య నిర్వహిస్తుంటారు. బుధవారం రాత్రి నుంచి ప్రారంభమైన జాతర గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ అంగరంగ వైభవంగా జరుగనున్నది. గురువారం ఉదయం పున్నమ్మ బోడు గుట్ట వద్ద ఉన్న కంకవనం వద్ద పూజలు నిర్వహించి కంకవనాన్ని ఫూట్ ఫారమ్‌లోని ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అదే రోజు సాయంత్రం సమ్మక్క-సారలమ్మను గుడికిలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో బోనాలు, గుడి మెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతరకు మండలం నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి మొక్కలు చెల్లించడం, శనివారం మళ్లీ అమ్మవార్లు వనప్రవేశం చేయనున్నట్లు పూజారి సమ్మయ్య తెలిపారు.

గణపురం పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

గణపురం, ఫిబ్రవరి 6 : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్‌వో మధుసూదన్ ఆస్మికంగా తనిఖీ చేశారు పీహెచ్‌సీలోని అన్ని విభాగాలు తిరిగి చూశారు, ఫార్మసీ, ల్యాబ్, లేబర్ రూమ్, వార్డులను సందర్శించి అడ్మిట్ అయిన రోగులను వైద్య సేవలపై ఆరాతీశారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. డాక్టర్ అనూష, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ సీజ్

గణపురం, ఫిబ్రవరి 6 : మండలంలోని చెరువులు, కుంటల్లో అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని ఐబీ ఏఈఈ సమ్మరావు హెచ్చరించారు. బుధవారం రాత్రి చెల్పూర్ జీపీ పరిధి సింగరేణి 1000 క్వార్టర్ల సమీపంలోని కర్నాల కుంటలో మట్టిని తవ్వుతున్న విజేందర్ రెడ్డికి చెందిన జేసీబీని సీజ్ చేసి యజమానిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసిన పోలీసులు జేసీబీని స్టేషన్‌కు తరలించారన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

మహదేవపూర్ (కాళేశ్వరం), ఫిబ్రవరి 6 : కాళేశ్వరం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన లీగ్ ప్రీమియం క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు గురువారం బహుమతులను అందజేశారు. మొదటి స్థానం మాస్టర్ మైండ్ టీం సాధించగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ వెన్నపురెడ్డి వసంత మోహన్‌రెడ్డి రూ.10,116 జట్టు సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రెవెళ్లి రాకేశ్, మేకల సురేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్నేహితుడి వైద్యానికి ఆర్థికసాయం

వాజేడు, ఫిబ్రవరి 6 : మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన సుగందపు భిక్షపతి కొద్దికాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. ఆర్థికస్తోమత అంతగాలేక ఇబ్బందులు పడుతుండడానికి తోటు ఇటీవల భిక్షపతి తల్లి సైతం చనిపోయింది. విషయం తెలుసుకున్న 2003 టెన్త్ క్లాస్ బ్యాచ్‌కు చెందిన స్నేహితులు గురువారం భిక్షపతిని పరామర్శించారు. రూ.11వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ముడిగ తిరుపతియాదవ్, చోడ రాంబాబు, షేక్ తాజుద్దీన్, కల్లూరి సతీశ్, పీర్ల స్వప్న, కవిత, గారపాటి సతీశ్ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, పలు సంఘాల నేతలు, స్థానికులు

మంత్రి ఇలాకాలో ఇసుక లారీ బీభత్సం

- కాటారంలో బైక్‌పైకి దూసుకెళ్లడంతో ఓ వ్యక్తి కాళ్లకు తీవ్రగాయాలు

జయశంకర్ భూపాలపల్లి. ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): కాటారంలో గురువారం ఇసుక లారీ బీభత్సం సృష్టించింది. ప్రధాన కూడలిలో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి రెండు కాళ్లు నుజ్జునుజ్జయి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సబ్‌స్టేషన్‌పల్లికి చెందిన తోట రవి గురువారం బైక్‌పై మండలకేంద్రంలో వెళ్తుండగా, మహదేవపూర్ వైపు నుంచి ఇసుక లోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. బైక్‌ను కొంత దూరం ఈడ్చుకొని వెళ్లడంతో రవి రెండు కాళ్లు నుజ్జునుజ్జై తీవ్ర రక్తస్రావం జరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికుల సాయంతో 108 అంబులెన్స్‌లో భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇసుక లారీని పట్టుకొని డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గ్రామస్తుల ధర్నా.. మంత్రి శ్రీధర్‌బాబు తీరుపై తీవ్ర ఆగ్రహం

ఇసుక లారీలను నియంత్రించాలని కాటారం ప్రధాన కూడలిలో గ్రామస్తులు, పలు సంఘాల నాయకులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. వారికి బీఆర్ఎస్ నేతలు జక్కు రాకేశ్, జోడు శ్రీనివాస్, రామిళ్ల కిరణ్, జక్కు శ్రావన్ మద్దతు తెలిపారు. అధికారంలోకి వస్తే ఇసుక లారీలను రెండు రోజుల్లో నడువకుంటా చేస్తామని చెప్పిన మంత్రి శ్రీధర్‌బాబు ఇప్పుడు వరుస ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడంలేదనిఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రవికి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని, అతని కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళనను విరమించారు. రవి వైద్య ఖర్చుల కోసం గ్రామస్తులు, స్థానికులు డబ్బులను జమచేసి కుటుంబ సభ్యులకు అందజేశారు.

అభివృద్ధిపై మంత్రి శ్రీధర్‌బాబుకు చిత్తశుద్ధి ఏది ?

- తాడిచెర్ల -భూపాలపల్లి రోడ్డు పూర్తికి ఇంకెన్నాళ్లు ?
- మండిపడిన బీఆర్ఎస్ నాయకులు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

జయశంకర్ భూపాలపల్లి. ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : మంత్రి శ్రీధర్‌బాబుకు నియోజకవర్గంపై ఏమాత్రం చిత్తశుద్ధి, అభివృద్ధిపై ధ్యాస ఉన్నా తాడిచెర్ల - భూపాలపల్లి రోడ్డును వెంటనే పూర్తి చేయించాలని మల్హర్ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. తాడిచెర్లలో గురువారం మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, మాజీ మండల అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ మాట్లాడారు. తమ నాయకుడు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఎంతో చొరవ తీసుకొని తాడిచెర్ల నుంచి భూపాలపల్లికి దూరభారం తగ్గించే ఉద్దేశంతో గత సీఎం కేసీఆర్‌ను ఒప్పించి తాడిచెర్ల నుంచి భూపాలపల్లికి కిషన్‌రావుపల్లి మీదుగా రోడ్డు మంజూరు చేయించారని తెలిపారు. అది సగం వరకు పూర్తయ్యాక ఫారెస్టు క్లియరెన్స్ ఆలస్యం కావడంతో మధ్యలోనే ఆగిపోయిందన్నారు. తీరా అటవీ శాఖ నుంచి అనుమతులు తీసుకవచ్చేలోగా ఎన్నికలు రావడంతో రోడ్డు ఆగిపోయిందని, ఇప్పుడు మిగతా రోడ్డును పూర్తి చేయాల్సిన బాధ్యత ఈ ప్రాంత ఎమ్మెల్యే అయిన శ్రీధర్‌బాబుపై ఉందని గుర్తు చేశారు. కానీ, అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా రోడ్డును పట్టించుకోవడం లేదని విమర్శించారు. పభుత్వంలో కీలక పదవిలో ఉన్న ఆయనకు రోడ్డు పూర్తి చేయడం కూడా సాధ్యం కావడం లేదా అని ప్రశ్నించారు. సుమారు రూ.5 కోట్లు వెచ్చించి తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీశ్, మాజీ సర్పంచ్ సుంకరి సత్తయ్య, మాజీ ఎంపీటీసీ రావుల కల్పన, గ్రామ శాఖ అధ్యక్షుడు అన్నమనేని మధుసూదన్‌రావు, నారా రమేశ్, మల్క రాజేశ్వర్‌రావు, నారా సమ్మయ్య, బొంతల రమేశ్, మల్క కిషన్, కామ శంకర్, వినయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 6 : మండలంలోని జిల్లాకాలనీ, టేకులబోరు, మంగవాయి, ముక్కునూరుపాలెం, రామచంద్రాపురం, మొర్రవానిగూడెం, ఆలుబాక, బర్రెబొంద, ఎదిర గ్రామాల్లో ఖమ్మం వారి గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా జీపీ కార్యదర్శి పాయం రాజకుమారి హాజరై పంపిణీ చేశారు. జీఎస్ఎస్ చైల్డ్ కేర్ సెంటర్‌లోని నిరుపేద విద్యార్థులకు దుస్తులు అందించడం అభినందనీయమన్నారు. చైల్డ్‌కేర్ సెంటర్ ఇన్‌చార్జి ముర్రం రాజేశ్, పున్నం ఆంజనేయులు, జయరాజు, సాధన స్వచ్ఛంద సంస్థ సిబ్బంది మురళీకృష్ణారెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.



దుస్తులు అందజేస్తున్న కార్యదర్శి రాజకుమారి